క్లుప్తంగా

విద్యార్థికి అభినందన


విద్యార్థి హరికృష్ణను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కవిటి: విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని అపోటా ప్రధాన కార్యదర్శి బృందావన్ దొళాయి అన్నారు. శనివారం సహలాలపుట్టుగ ఒడియా ఉన్నత పాఠశాల ఆవరణలో ఇటీవల నిర్వహించిన మండలస్థాయి ప్రాథమిక పాఠశాల విద్యార్థుల టాలెంట్ టెస్ట్‌లో విజేతగా నిలిచిన ఎర్ర హరికృష్ణను ఈ సందర్భంగా అభినందించి రూ.2500 నగదుతో పాటు మెమెంటో, సర్టిఫికెట్‌ను అందజేశారు. విద్యార్థికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయుడు దేవదాస్ బెజ్జిపల్లిని మండల ఒడియా ఉపాధ్యాయుల సంఘం తరపున అభినందించారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు


పుక్కళపాలెంలో ఆవుకు వ్యాక్సిన్ వేస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

కవిటి: పశువులకు వ్యాధులు ప్రబలకుండా వాటి యజమానులు శ్రద్ధకనబర్చాలని కవిటి పశువైద్యశాల ఇన్‌చార్జి డాక్టర్ జి.కిరణ్‌కుమార్ అన్నారు. జాలారిపాలెం, పుక్కళపాలెం గ్రామాల్లో శనివారం పశువులకు గాలికుంటు వ్యాధి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. 50 ఆవులు, దూడలకు గాలికుంటువ్యాధి నిరోధక వ్యాక్సినేషన్‌లు 200 మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందులు వేశారు. పశువైద్య సిబ్బంది పురుషోత్తం, శంకర్ పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలి


షార్ట్‌ఫిల్మ్ చిత్రీకరణలో ఓ సన్నివేశం

పలాస: రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటే కేంద్ర ప్రభుత్వం తగిన అవార్డు ఇస్తుందని గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాల్ చెప్పారు. రెంటికోట గ్రామంలో రోడ్డు ప్రమాదానికి గురైన వారిని ఎలా ఆదుకోవాలనే అంశంపై షార్ట్‌ఫిల్మ్‌ను శనివారం చిత్రీకరించారు. జీకే ప్రసాద్ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదానికి గురైనవారు 60 నిమిషాల్లో ఆస్పత్రిలో చేరుకుంటే దాన్ని గోల్డెన్ అవర్ అంటారన్నారు. అటువంటి పరిస్థితిల్లో వారి ప్రాణాలను కాపాడు వచ్చన్నారు. కార్యక్రమంలో పలాస వాసీ దిలీప్, నటీ నటులు తేజ, ప్రభావతి, రెంటికోట యువత పాల్గొన్నారు.

జెడ్పీ సీఈవో ఆకస్మిక తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న సీఈవో శ్రీధర్‌రాజా

కంచిలి: స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని జిల్లాపరిషత్ సీఈవో ఎల్.ఎస్.వి.శ్రీధర్ రాజా శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వి.తిరుమలరావు, సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. కార్యాలయ రికార్డులను పరిశీలించారు.

మసీదులు ముస్తాబు


విద్యుత్ వెలుగుల్లో తర్లాకోట మసీదు

కాశీబుగ్గ: రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా ఆయా మసీదుల వద్ద శనివారం నుంచే సందడి కనిపించింది. ఆదివారం సూర్యోదయం నుంచి ఉపవాస దీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా పలాస మండలం తర్లాకోట, కాశీబుగ్గలోని జామియా మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

స్నేహితుడికి అండగా..


రికార్డులను పరిశీలిస్తున్న సీఈవో శ్రీధర్‌రాజా

కంచిలి: మఠంసరియాపల్లి గ్రామానికి చెందిన నరేష్‌కుమార్ గొంతు క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న తనతో పాటు స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో చదువుకున్న స్నేహితులు రూ. 33 వేలు సేకరించారు. ఈ మొత్తంలో 22 వేల రూపాయలను బాధితుడికి శనివారం అందజేయగా.. మిగతా రూ. 10 వేలును తన కుమార్తె పేరున సుకన్య అకౌంట్లో డిపాజిట్ చేశారు. పూర్వవిద్యార్థులు ఉప్పాడ పురుషోత్తం, అరుణకుమారి, ఉప్పాడ సందీప్ ఉన్నారు.

సర్వే ఇప్పుడు.. సమస్య పరిష్కారమెప్పుడో?

- నత్తనడకన క్రాస్ సర్వే!
- బోర్లు, నీటి పథకాల పరిస్థితులపై పూర్తికాని సర్వే ప్రక్రియ
- గ్రామాల్లో దాహం కేకలు


టెక్కలి మండలం మాకవరం సమీపంలో పనిచేయని డైరెక్ట్ పంపింగ్ మంచినీటి పథకం

టెక్కలి: ఫిబ్రవరి నెల నుంచే భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. ఈ ఏడాది వేసవి తాపం అధికంగా ఉంటుందనే విషయాన్ని వాతావరణ శాఖ ఇప్పటికే స్పష్టం చేసింది. వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో నీటి ఎద్దడి ఆరంభమవుతోంది. నివారణ చర్యలు చేపట్టాల్సిన అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో ప్రణాళికలు చేపట్టలేదు. మరో వైపు గ్రామాల్లో మంచినీటి బోర్లు, రక్షిత మంచినీటి పథకాల పరిస్థితులపై గ్రామీణ నీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో 'క్రాస్'సర్వే చేస్తున్నారు. ఫిబ్రవరి 16 నుంచి మార్చి 14వ తేదీ వరకు ఈ సర్వే కొనసాగనుంది. సర్వేలో భాగంగా బోర్లు, మంచినీటి పథకాల పరిస్థితులను యాప్‌లో నమోదు చేసి నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నారు. ఆ తరువాత ఆయా మంచినీటి పథకాల నిర్వాహణకు అవసరమైన చర్యలు చేపట్టనున్నారు. ప్రస్తుతం ఈ సర్వే నత్తనడకన సాగుతోంది. అంతే కాకుండా ఇప్పుడు సర్వే చేస్తుంటే నీటి ఎద్దడి నివారణ చర్యలు ఎప్పుడు చేస్తారనే సందేహం ప్రజల్లో వ్యక్తమవుతోంది. మరో వైపు కొన్ని గ్రామాల్లో నీటి పథకాలు పనిచేయకపోవడంతో ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు.

సర్వే ఇలా..

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మంచినీటి బోర్లు, డైరెక్ట్ పంపింగ్ స్కీమ్‌లు, రక్షిత మంచినీటి పథకాలు సక్రమంగా ఉన్నాయా లేదా అనే విషయమై గ్రామీణ నీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో క్రాస్ సర్వే చేస్తున్నారు. ఆయా నీటి వనరుల ఫొటోలను యాప్‌లో నమోదు చేస్తున్నారు. టెక్కలి నియోజకవర్గంలో ప్రస్తుతానికి చేపట్టిన సర్వేను పరిశీలిస్తే..

- టెక్కలి మండలంలో మొత్తం 352 మంచినీటి బోర్లకు 136 సర్వే చేయగా వాటిలో 114 పనిచేస్తున్నాయి. మిగిలిన 22 మరమ్మతులకు గురైనట్లు గుర్తించారు. అలాగే డీపీ స్కీమ్‌లు 16 ఉండగా ఇంకా సర్వే ప్రారంభించలేదు. అయితే ప్రాథమికంగా మూడు పనిచేయడం లేదని గుర్తించారు. సురక్షిత మంచినీటి పథకాలు (పీడబ్ల్యూఎస్) 43 ఉండగా ఎనిమిది సర్వే చేశారు. వాటిలో నాలుగు పనిచేయడం లేదని గుర్తించారు.
- నందిగాం మండలంలో 414 మంచినీటి బోర్లకు 276 సర్వే చేయగా వాటిలో నాలుగు మరమ్మతులకు గురయ్యాయి. అలాగే డీపీ స్కీమ్‌లు మొత్తం 34 ఉండగా ఏడు సర్వే చేయగా.. మూడు పనిచేయడం లేదని గుర్తించారు. సురక్షిత మంచినీటి పథకాలు (పీడబ్ల్యూఎస్) 49 ఉండగా పది మాత్రమే సర్వే చేశారు.
- సంతబొమ్మాళి మండలంలో 369 బోర్లకు 28 సర్వే చేయగా వాటిలో ఆరు పాడైనట్లు గుర్తించారు. డీపీ స్కీమ్‌లు 17 ఉండగా ఇంకా సర్వే ప్రారంభించలేదు. అలాగే సురక్షిత మంచినీటి పథకాలు(పీడబ్ల్యూఎస్) సర్వే కూడా ప్రారంభం కాలేదు.
- కోటబొమ్మాళి మండలంలో 481 మంచినీటి బోర్లకు 179 సర్వే చేయగా వాటిలో ఎనిమిది మరమ్మతులకు గురైనట్లు గుర్తించారు. డీపీ స్కీమ్‌లు 31 ఉండగా ఇంకా సర్వే ప్రారంభించలేదు. సురక్షిత మంచినీటి పథకాలు(పీడబ్ల్యూఎస్) 31 ఉండగా ఆరు మాత్రమే సర్వే చేశారు.


టెక్కలి మండలం లచ్చన్నపేటలో చుక్కనీటిని రాల్చని కుళాయిలు

నీటి కోసం ఇబ్బందులు పడుతున్నాం



మా ఊరికి మంచినీటి పథకం ఉన్నప్పటికీ అది పని చేయడం లేదు. నీటి కోసం అనేక ఇబ్బందులు పడుతున్నాం. గ్రామంలో ఉన్న బోరు నీటిని వినియోగిస్తున్నాం. ఆ బోరు ఎప్పుడైనా రిపేర్ అయితే మాకు నీటి కష్టాలు తీవ్రంగా ఉంటాయి. మా ఊరిలో కుళాయిలు ఉన్నాయి అయినా నీరు రావడం లేదు.

–బి.పాపమ్మ, లచ్చన్నపేట, టెక్కలి మేజర్ పంచాయతీ

నీటి ఎద్దడి లేకుండా చర్యలు



ఈ ఏడాది వేసవిలో నీటి ఎద్దడి లేకుండా పట్టణ, గ్రామాల్లో పత్యేక చర్యలు చేపడుతున్నాం. ఇందులో భాగంగా ఇప్పటికే క్రాస్ సర్వే చేస్తున్నాం. ఆ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తాం. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలను గుర్తించి అక్కడ తక్షణ చర్యలు చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. నీటి ఎద్దడిపై ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

–ఎస్.రామకృష్ణ, డీఈ, ఆర్‌డబ్ల్యూఎస్, టెక్కలి

ఇంటిపన్ను శతశాతం వసూలు చేయాలి

- డీపీవో భారతి సౌజన్య


మండలస్థాయి అధికారులతో సమీక్షిస్తున్న డీపీవో భారతీసౌజన్య

కవిటి: ఇళ్లపన్నును శతశాతం వసూలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారిణి కె.భారతీ సౌజన్య అన్నారు. మండలంలోని వివిధ పంచాయతీల్లో నిర్వహిస్తున్న చెత్తతో సంపదకేంద్రాల నిర్వాహణ తీరును శనివారం పరిశీలించారు. జగతి పంచాయతీలో ఇప్పటి వరకు ఎందుకు చెత్తతో సంపదకేంద్రం నిర్వహణ ప్రారంభం కాలేదని ఆరా తీశారు. బెజ్జిపుట్టుగ, కవిటి పంచాయతీల్లోని సంపదకేంద్రాల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. బెజ్జిపుట్టుగ పంచాయతీలో చెత్తతో సంపద కేంద్రం నిర్వహణ ద్వారా బ్యాంకు ఖాతాలో రూ.28 వేలు నిల్వ ఉందన్న విషయాన్ని సర్పంచ్ ఎస్‌పీ నారాయణస్వామి డీపీవో దృష్టికి తీసుకువెళ్లారు. రానున్న వేసవిలో ఎక్కడా మంచినీటి ఎద్దడి లేకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని కవిటి సచివాలయం ఆవరణలో నిర్వహించిన మండలస్థాయి అధికారుల సమీక్షా సమావేశంలో ఎంపీడీవో కె.శ్రీనివాసరెడ్డికి సూచించారు. పలువురు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి నాయకుల పరామర్శ


రమణమూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కంచిలి: మకరాంపురం గ్రామానికి చెందిన పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు తమరాల శోభన్‌బాబు తండ్రి రమణమూర్తి ఇటీవల మృతిచెందారు. ఈ విషయం తెలుసుకొని శాసనసభ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావులు మృతుని కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించారు. మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, పార్టీ నేతలు ఇప్పిలి క్రిష్ణారావు, పూడి నేతాజీ, గుమ్మిడి రామదాసు ఉన్నారు.

కొనసాగుతున్న మిల్లు కార్మికుల సమ్మె


సిద్ధూరు వద్ద ధర్నా చేస్తున్న రైస్‌మిల్ కార్మికులు

మందస/కాశీబుగ్గ: గత 19 రోజులుగా చార్టర్ ఆఫ్ డిమాండ్స్ పరిష్కారం చేయాలని రైస్ మిల్లు కార్మికుల చేస్తున్న సమ్మె కొనసాగుతోంది. మందస మండలంలోని మందస, సిద్ధూరు పరిధిలోని మిల్లు కార్మికులకు, యజమానులకు మధ్య 40 సంవత్సరాలుగా ప్రతీ రెండేళ్లకు ఒకసారి వేతన ఒప్పందం జరుగుతుంది. 2024వ సంవత్సరం జూన్ 30వ తేదీతో గత రెండేళ్ల ఒప్పందం పూర్తయింది. నూతన ఒప్పందం చేయాలని కోరుతూ కార్మికులు సమ్మెకు దిగారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. రైస్ మిల్లు కార్మికులకు ఎటువంటి సౌకర్యాల్లేవని, మిల్లులో పనిచేస్తూ చాలామంది అనారోగ్యాలతో ఇబ్బందులు పడుతున్నా పరిహారం ఇవ్వడం లేదని, కనీసం కూలి రేట్టైనా పెంచడానికి ఇష్టపడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు జోక్యం చేసుకొని తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. కార్యక్రమంలో రైస్ మిల్ కార్మిక సంఘ అధ్యక్షులు టి.బాలక్రిష్ణ, కార్యదర్శి కె.కేశవరావు, కో–కన్వీనర్ బి.దుర్యోధన, కమిటీ సభ్యులు బి.మల్లేషు, బి.వెంకటేష్, కె.క్రిష్ణారావు, ఆర్.యాకాశి, పి.కూర్మారావు, ఎన్.లచ్చయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

ఇచ్ఛాపురం: విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఈవో కె.అప్పారావు అన్నారు. పురుషోత్తపురం ఉన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థుల ఫెయిర్‌వెల్ కార్యక్రమాన్ని హెచ్‌ఎం వై.లత అధ్యక్షతన శనివారం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. ఈ నెల 17వ తేదీ నుంచి ప్రారంభంకానున్న పబ్లిక్ పరీక్షల్లో మంచిఫలితాలు సాధించి పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- తొలిరోజు ప్రశాంతం


టెక్కలి బీఎస్ అండ్ జేఆర్ పరీక్షా కేంద్రానికి ఉదయం ఎనిమిది గంటలకే చేరుకున్న విద్యార్థులు

టెక్కలి: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలిరోజు ప్రథమ సంవత్సరం విద్యార్థులు పరీక్షలకు హాజరవ్వగా.. ప్రశాంతంగా ముగిశాయి. టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాల, బీఎస్‌అండ్‌జేఆర్, ఎస్‌వీఆర్‌కే తదితర జూనియర్ కళాశాల కేంద్రాల్లో 1043 మంది విద్యార్థులను కేటాయించగా 1011 మంది పరీక్షలు రాయగా.. 32 మంది గైర్హాజరయ్యారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరిగాయి.

ప్రశాంతంగా ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

కంచిలి: మండల కేంద్రం కంచిలిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, క్రిష్ణసాయి కళాశాలల్లో కేంద్రాలను కేటాయించారు. క్రిష్ణసాయి కళాశాల కేంద్రంలో 192 మందికి 187 మంది పరీక్షకు హాజరవ్వగా.. ఐదుగురు గైర్హాజరయ్యారని డీవోఎం అనసూయ తెలిపారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో 203 మందికి 191 మంది పరీక్షకు హాజరవ్వగా 12 మంది గైర్హాజరైనట్లు పరీక్ష కేంద్రం చీఫ్ నవ్యశ్రీ పట్నాయక్ తెలిపారు.

సంతబొమ్మాళి: నౌపడ ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో 132 మంది విద్యార్థులకు 127 మంది పరీక్షకు హాజరయ్యారు. ఐదుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. సీఎస్‌గా నారాయణరావు, డిపార్టుమెంట్ అధికారిగా నాగేశ్వరరావులు వ్యవహరించారు.

సోంపేట: సోంపేట మండలంలో 24 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. సోంపేటలో మూడు, బారువలో ఒక కేంద్రాన్ని అధికారులు కేటాయించారు. వీటిలో 1229 మంది పరీక్ష రాయాల్సి ఉండగా.. 1204 మంది హాజరయ్యారన్నారు.

ఇచ్ఛాపురం: స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల కేంద్రంలో 295 మందికి 286 మంది పరీక్షకు హాజరవ్వగా తొమ్మిది మంది గైర్హాజరయ్యారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల కేంద్రంలో 284 మందికి 270 హాజరవ్వగా 14 మంది గైర్హాజరయ్యారు. స్వర్ణభారతి ప్రవేటు జూనియర్ కళాశా కేం7దంలో 305 మందికి 293 మంది హాజరవ్వగా 12 మంది గైర్హాజరైనట్లు అధికారులు వెల్లడించారు. సీఎస్‌లుగా వి.శంకర్ ప్రసాద్, శంకర్‌రావు, బబులాసాహు, డీవోలుగా ఎస్.వెంకటరావు, యుగంధర్, భవితసాహు వ్యవహరించారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

కాశీబుగ్గ: వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పలాస అసెంబ్లీ నియోజకవర్గంలో పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం జరిగింది. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ప్రకటన విడుదలైంది. యూత్ వింగ్ అధ్యక్షులుగా దున్న హరిక్రిష్ణ, మహిళా విభాగం అధ్యక్షులుగా పండా సుజాత యాదవ్, రైతు విభాగం అధ్యక్షులుగా తమ్మినేన ఢిల్లీశ్వరరావు, బీసీ సెల్ అధ్యక్షులుగా మద్దిలి హరినారాయణ, ఎస్సీ సెల్ అధ్యక్షులుగా వాయలపల్లి లక్ష్మణ్, ఎస్టీ సెల్ అధ్యక్షులుగా సవర నీలకంఠం, మైనార్టీ సెల్ అధ్యక్షులుగా మాదిన బాషా, క్రిస్టియన్ మైనార్టీసెల్ అధ్యక్షులుగా సొదాల కుమార్, స్టూడెంట్ వింగ్ అధ్యక్షులుగా బమ్మిడి సంతోష్‌కుమార్, పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షులుగా కర్రి గోపి, మున్సిపల్ వింగ్ అధ్యక్షులుగా దుర్గాశంకర్ పండా, ఆర్‌టీఐ వింగ్ అధ్యక్షులుగా సీర ప్రసాద్, వలంటీర్ వింగ్ అధ్యక్షులుగా కోరాడ ధన్‌రాజ్, గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షులుగా ఇరోత్ హేమంత్, వాణిజ్య విభాగం అధ్యక్షులుగా తూముల శ్రీనివాసరావు, వివర్స్ వింగ్ అధ్యక్షులుగా దంతం వైకుంఠరావు, వైఎస్సార్ టీయూసీ అధ్యక్షులుగా అంబటి ఆనంద్, అంగన్‌వాడీ వింగ్ అధ్యక్షులుగా వంక గీత, లీగల్ సెల్ అధ్యక్షులుగా కొమర దేవరాజు, కల్చరల్ వింగ్ అధ్యక్షులుగా మామిడి క్రిష్ణరావు, సోషల్ మీడియా వింగ్ అధ్యక్షులుగా రుకునానా వెంకటరమణ, ఐటీ వింగ్ అధ్యక్షులుగా బత్తిని లక్ష్మణరావు, దివ్యాంగుల విభాగం అధ్యక్షులుగా దున్న బాలక్రిష్ణ, డాక్టర్స్ వింగ్ అధ్యక్షులుగా మట్ట జయరాం, పబ్లిసిటి వింగ్ అధ్యక్షులుగా మామిడి వీర్రాజు, బూత్ కమిటీ వింగ్ అధ్యక్షులుగా చింతాడ గణపతి, ఇంటలిక్చువల్ ఫోరం అధ్యక్షులుగా పీవీ సతీష్ నియమితులయ్యారు.

సజావుగా టెన్త్ పరీక్షలు నిర్వహించాలి

టెక్కలి: ఈ నెల 17వ తేదీ నుంచి ప్రారంభంకానున్న పదో తరగతి పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలని డీఈవో ఎస్.తిరుమలచైతన్య కోరారు. టెక్కలిలో డివిజన్ స్థాయిలో పరీక్షల నిర్వాహణ సిబ్బంది, చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంట్ అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. పరీక్ష కేంద్రంలో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని, ఎటువంటి మాస్ కాపీయింగ్ లేకుండా చూడాలన్నారు. టెక్కలి డివిజన్ పరిధిలో 34 కేంద్రాల్లో 6,419 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉందని ఉప విద్యా శాఖాధికారి పి.విలియమ్స్ వెల్లడించారు.

చక్రధరస్వామి డోలోత్సవం



కవిటి మండలం బెజ్జిపుట్టుగలోని చక్రధర స్వామి డోలోత్సవాలు శనివారం నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. వేడుకల్లో భాగంగా స్వామివారికి సుప్రభాత సేవ, మేలుకొలుపులను ఆలయ అనువంశిక అర్చక స్వాములు సత్యన్నారాయణస్వామి, రాజేష్ స్వామి, నరసింహం స్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలిరోజు కార్యక్రమాలను ఆలయ అనువంశిక ధర్మకర్తలమండలి సభ్యుడు పొందల శ్రీరాంబాబునాయుడు కుటుంబసభ్యులచే ప్రత్యేక పూజలు చేశారు. యండమూరి శిఖామణి భాగవతారిణిచే ఏర్పాటుచేసిన హరికథాగానానికి పాలపర్తి ఆంజనేయశర్మ వయోలిన్‌తో, బొంతలకోటి కృష్ణారావు మృదంగంతో వాయిద్య సహకారాన్ని అందించారు.

–కవిటి

హుండీ ఆదాయం లెక్కింపు



మండల కేంద్రం కంచిలి ప్రజల ఆరాధ్య దైవం కంచమ్మతల్లి అమ్మవారి ఆలయ హుండీలో భక్తులు ఫిబ్రవరి నెలలో వేసిన కానుకలను ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు శనివారం సాయంత్రం లెక్కించారు. గడచిన నెలకు సంబంధించి రూ. 30,687 వచ్చినట్లు సభ్యులు తెలిపారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వంకల సోమేష్, జగదీష్ పట్నాయక్, సాహుకారి సోమేశ్వరరావు పాల్గొన్నారు.

–కంచిలి

రామకృష్ణ పరమహంస జయంతి వేడుకలు



రామకృష్ణ పరమహంస మానవాళికి చూపిన మార్గం అనుసరణీయమని సోంపేట రామకృష్ణా సేవాసమితి సభ్యులు పేర్కొన్నారు. సేవాసమితి ఆధ్వర్యంలో పరమహంస 190వ జయంతి వేడుకలను శనివారం నిర్వహించారు. ప్రత్యేక పూజలు, భగవద్గీత పారాయణం, ఆధ్యాత్మిక సందేశాలు, భజనలు చేశారు. వక్తలు మాట్లాడుతూ.. రామకృష్ణ పరమహంస సరస్వతి స్వరూపుడని, సర్వమత సమన్వయకర్తని కొనియాడారు. అధ్యక్షులు గరుడాచల శంకరరావు, ఎం.అప్పారావు, ఆర్.నారాయణ, పి.కామేష్, బి.బాబూరావు పాల్గొన్నారు.

–సోంపేట

మండలస్థాయికి ఎంపిక..



సోంపేట మండలం బారువ మేజర్ పంచాయతీ బత్తుల వీధి ప్రాథమిక పాఠశాల నాలుగో తరగతి విద్యార్థిని జి.స్నేహిత చేపట్టిన ప్రాజెక్టు మండల స్థాయికి ఎంపికైందని హెచ్‌ఎం రట్టి అప్పారావు తెలిపారు. సైన్స్‌దినోత్సవాన్ని పురస్కరించుకుని స్నేహిత బారువ గ్రామ ప్రాచీన చారిత్రాత్మక గొప్పతనం వివరిస్తూ ప్రాజెక్టు రూపొందించింది. మండల స్థాయికి ఈ ప్రాజెక్టు ఎంపిక కావడంతో ఉపాధ్యాయులు స్నేహితను అభినందించారు.

–సోంపేట

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

కాశీబుగ్గ: చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని మందస మండలం సొండిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.సుందర సాల్మాన్ అన్నారు. పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం శనివారం ఉత్సాహంగా జరిగింది. పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఉపాధ్యాయులు సూచించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తప్పిన ప్రాణాపాయం

కాశీబుగ్గ: కాశీబుగ్గ బస్టాండ్ వద్ద శనివారం ఉదయం సోంపేటకు చెందిన వేణు అనే వ్యక్తి ఫిట్స్‌వచ్చి పడిపోవడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. వెంటనే స్థానికులు స్పందించి సపర్యలు చేశారు. అనంతరం 108 అంబులెన్సుకు సమాచారం అందించడంతో సిబ్బంది సత్యం, వెంకటరావు వచ్చి ప్రథమ చికిత్స అందించి పలాస ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించారు.